



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక






ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :93 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ సోమవారం 26 జనవరి 2026


# ఈ బడ్జెట్ సెషన్‌లోనే అమరావతికి రాజముద్ర:

- ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం-జనవరి 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

-టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు సమావేశం -అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై దృష్టి సారించాలని సూచన

-పోలవరం, నల్లమల సాగర్, పూర్వోదయ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీలకు స్పష్టం

-వివాదాలకు తావివ్వకుండా రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలని ఆదేశం

రాష్ట్రాభివృద్ధిలో పార్లమెంట్ సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు, ప్రాజెక్టులు సాధించడం ద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై గట్టిగా గళం విప్పాలని, తమ నియోజకవర్గాల అభివృద్ధి అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) సమావేశం జరిగింది. జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై ఎంపీలకు చంద్రబాబు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



2

# రాజ్యాంగమే మనకు మార్గదర్శి...

## - రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం

-గణతంత్ర దినోత్సవ పూర్వ సంధ్యలో జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి

-న్యాయం, సోదరభావమే గణతంత్రానికి పునాదులని స్పష్టం చేసిన ద్రౌపది ముర్ము

-దేశాభివృద్ధిలో మహిళలు, రైతులు, శాస్త్రవేత్తల పాత్రను కొనియాడిన రాష్ట్రపతి

-అంబేద్కర్ సందేశాన్ని, సాయుధ దళాల శౌర్యాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు

-రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలే ప్రభుత్వానికి మార్గదర్శకమని ఉద్ఘాటన

గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. న్యాయం, సోదరభావం అనే రెండు కీలకమైన అంశాలను మన రాజ్యాంగం నిర్వచించిందని, అవే గణతంత్రానికి పునాదులని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దార్శనికత, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.



2

# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి

## : హరీశ్ రావు సంచలన ఆరోపణలు

-సింగరేణిలో భారీ అవినీతి జరిగిందన్న హరీశ్ రావు-సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ

-సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్-సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ

-అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ

సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు. ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు. జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో



మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

# ధర్మేంద్రకు పద్మవిభూషణ్... మమ్ముట్టికి పద్మభూషణ్

- పద్మ పురస్కారాలు 2026: నోరి దత్తాత్రేయుడికి పద్మ భూషణ్

-అల్కా యాగ్నిక్‌కు పద్మ భూషణ్

-పలువురు ప్రముఖులకు అత్యున్నత గౌరవం



2

కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాది సినీ రంగానికి చెందిన ఇద్దరు దిగ్గజ నటులకు అరుదైన గౌరవం దక్కింది. దివంగత బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ (మరణానంతరం) లభించగా, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి పద్మ భూషణ్‌కు ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను గౌరవిస్తూ కేంద్రం ఈ జాబితాను విడుదల చేసింది. పద్మ విభూషణ్ పురస్కారానికి మొత్తం ఐదుగురిని ఎంపిక చేయగా, వారిలో కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు కూడా మరణానంతరం ఈ గౌరవాన్ని ప్రకటించారు. ఇక పద్మ భూషణ్ పురస్కార గ్రహీతల్లో ప్రఖ్యాత గాయని అల్కా యాగ్నిక్, తెలుగు వారికి సుపరిచితులైన క్యాన్సర్ వైద్య నిపుణులు, ఎన్నారై డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, భారత టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ వంటి ప్రముఖులు ఉన్నారు. ఝార్ఖండ్ మాజీ సీఎం షిబు సోరెన్‌కు మరణానంతరం పద్మ భూషణ్ ప్రకటించారు.

# ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి

-: కేటీఆర్



2

కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల్లో తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించగా, అందులో తెలంగాణ నుంచి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సముచిత స్థానం దక్కడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు.

# తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదు: సీఎం స్టాలిన్

-భాషా అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం స్టాలిన్ నివాళి

-తమిళనాడులో హిందీకి ఎప్పటికీ స్థానం లేదని స్పష్టీకరణ

-హిందీ రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని మరోసారి ఉద్ఘాటన

-అమరవీరులకు నివాళులర్పించిన పళనిస్వామి, విజయ్



2

# ఈ బడ్జెట్ సెషన్‌లోనే అమరావతికి రాజముద్ర:

**అమరావతికి రాజముద్ర.. ప్రాజెక్టులకు ప్రాధాన్యం**

ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదముద్ర వేయించడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి కేంద్రంలోని మంత్రులు, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధికి వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం, పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకోవాలని అన్నారు.
ఫిబ్రవరిలో జరగనున్న కలెక్టర్ల సదస్సులో ఎంపీలందరూ వర్చువల్‌గా పాల్గొని రాష్ట్రంలోని క్షేత్రస్థాయి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమన్వయం కోసం నియమించిన ఎంపీలు, ఆయా శాఖలకు సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చంద్రబాబు తెలిపారు.

**వివాదాలు వద్దు.. నీళ్లే ముఖ్యం**

నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో పొరుగు రాష్ట్రాలతో వివాదాలు వద్దని, మనకు కావాల్సింది నీళ్లు మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన తాజా అంచనాలను కేంద్రానికి సమర్పించామని, ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి ఇంకా రూ.12,000 కోట్లు రావాల్సి ఉందని సమావేశంలో ప్రస్తావించారు.
2027 జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. నల్లమల సాగర్ ప్రాజెక్టు అంశం పార్లమెంటులో ప్రస్తావనకు వస్తే, రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలన్నారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మంజీరాకు నీటిని తరలించినప్పుడు ఏపీ అభ్యంతరం చెప్పలేదని, అలాంటిది నల్లమల సాగర్‌కు తెలంగాణ అభ్యంతరం చెప్పడం సరికాదనే విషయాన్ని కేంద్రానికి స్పష్టంగా వివరించాలని ఎంపీలకు సూచించారు.

**నిధుల సమీకరణే లక్ష్యం**

పూర్వోదయ ప్రాజెక్టు కింద రూ.40 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇచ్ఛాపురం నుంచి తడ వరకు నాలుగు లేన్ల రైల్వే ట్రాక్ సాధించేలా కృషి చేయాలని చంద్రబాబు కోరారు. రైల్వే శాఖ వద్ద భారీగా నిధులు అందుబాటులో ఉన్నాయని, ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో అవకాశాలను గుర్తించి, నిధులు సాధించాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆసుపత్రుల నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభలో కానీ, బయట కానీ కూటమి లక్ష్యాలకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించవద్దని గట్టిగా హెచ్చరించారు.

**జాతీయ అంశాలపైనా గళం విప్పండి**

రాష్ట్ర అంశాలతో పాటు జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ఎంపీలు అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టడంలో చొరవ చూపాలని అన్నారు.
ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఎంపీలు తమ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు భారతదేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారని, ఇది రాష్ట్రానికి ఉన్న సానుకూల దృక్పథాన్ని తెలియజేస్తోందని ఎంపీలకు వివరించారు

# ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి:

ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... సైన్స్, వైద్యం, కళలు, పశుసంవర్ధక వంటి భిన్న రంగాల్లో తెలంగాణ ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో చంద్రమౌళి గడ్డమానుగు, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్, కుమారస్వామి తంగరాజ్‌లకు; వైద్య రంగంలో డాక్టర్ గూడూరు వెంకట్ రావు, డాక్టర్ పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డిలకు, కళల విభాగంలో కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మశ్రీలు దక్కాయని గుర్తుచేశారు. పశుసంవర్ధక రంగంలో విశేష సేవలు అందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడం ఆయన నిస్వార్థ సేవకు దక్కిన నిజమైన గౌరవమని అభిప్రాయపడ్డారు.క్షేత్రస్థాయిలో నిశ్శబ్దంగా సమాజం కోసం పనిచేసే వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పురస్కారాలు కేవలం వ్యక్తులకు దక్కిన గౌరవంగానే కాకుండా, రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆకాంక్షించారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతిభావంతులు తమ తమ రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు

# తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదు

తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదని డీఎంకే అధినేత, సీఎం ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 'భాషా అమరవీరుల దినోత్సవం' సందర్భంగా గతంలో హిందీ వ్యతిరేక ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని ఆయన స్మరించుకున్నారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని తమ రాష్ట్రం ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా స్టాలిన్ చెన్నైలోని భాషా అమరవీరులు తలముత్తు, నటరాజన్ స్మారకం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీఎండీఏ భవనంలో వారి విగ్రహాలను ఆవిష్కరించారు. "తమిళ భాషను ప్రాణంలా ప్రేమించే రాష్ట్రం, హిందీ రుద్దడాన్ని ఐక్యంగా ఎదుర్కొంది. ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన తెలిపింది" అని స్టాలిన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందీ వ్యతిరేక ఉద్యమ చరిత్ర, డీఎంకే నేతలు సీఎన్ అన్నాదురై, ఎం. కరుణానిధి పాత్రను వివరిస్తూ ఒక వీడియోను కూడా పంచుకున్నారు.1964-65 మధ్యకాలంలో హిందీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఆత్మార్పణం చేసుకున్న వారిని తమిళనాడు 'భాషా అమరవీరులు'గా గౌరవిస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020 ద్వారా హిందీని రుద్దే ప్రయత్నం జరుగుతోందని డీఎంకే ఆరోపిస్తున్న నేపథ్యంలో తమిళనాడులో తమిళం, ఇంగ్లీష్ అనే ద్విభాషా సూత్రమే అమలవుతోంది.మరోవైపు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ కూడా భాషా అమరవీరులకు నివాళులు అర్పించారు. "తల్లి తమిళం మా ప్రాణంతో సమానం" అని పళనిస్వామి పేర్కొన్నారు.

# రాజ్యాంగమే మనకు మార్గదర్శి..

దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. దేశ భద్రతకు కాపలా కాస్తున్న సాయుధ బలగాల శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, 'ఆపరేషన్ సిందూర్'ను ఆమె గుర్తుచేశారు. దేశ పురోభివృద్ధికి దోహదపడుతున్న రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనిక, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, యువత సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.
ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి ఎన్నికలలో పాల్గొనడం పౌరుల బాధ్యత అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లకు నివాళులర్పించిన కార్యక్రమాలను కూడా ఆమె ప్రస్తావించారు.
భారత ప్రజాస్వామ్య క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ వార్షిక ప్రసంగం దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు చేరింది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్‌తో పాటు అన్ని దూరదర్శన్ ఛానెళ్లలో ప్రసారం చేశారు. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో రాష్ట్రపతి ప్రసంగించారు. అనంతరం, దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లు వివిధ ప్రాంతీయ భాషలలో ఈ సందేశాన్ని ప్రసారం చేశాయి. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు తమ మాతృభాషలో రాష్ట్రపతి సందేశాన్ని వినే అవకాశం కలిగింది.
గణతంత్ర భారతదేశం ఆవిర్భవించిన తొలి నాళ్ల నుంచి రాష్ట్రపతి ప్రసంగం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది దేశ ప్రగతి, విజయాలు, సవాళ్లను సమీక్షించుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చారిత్రక రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజునే మన దేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా అవతరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ప్రసంగం, జనవరి 26 వేడుకలకు స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందిస్తూ, ఐక్యత ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

# ధర్మేంద్రకు పద్మవిభూషణ్... మమ్ముట్టికి పద్మభూషణ్

ఈ ఏడాది మొత్తం 131 మందిని పద్మ పురస్కారాలు వరించాయి. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు ఉన్నాయి. కళలు, సామాజిక సేవ, సైన్స్, వాణిజ్యం, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు, 6 మంది విదేశీ/ఎన్నారైలు ఉండగా, 16 మందికి మరణానంతరం ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారాలను మార్చి లేదా ఏప్రిల్ నెలలో రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం చేస్తారు.

పద్మ పురస్కారాల గ్రహీతల జాబితా:

పద్మ విభూషణ్

1. ధర్మేంద్ర సింగ్ డియోల్ (మరణానంతరం) - కళలు - మహారాష్ట్ర
2. కె.టి. థామస్ - పబ్లిక్ అఫైర్స్ - కేరళ
3. ఎన్. రాజం - కళలు - ఉత్తర ప్రదేశ్
4. పి. నారాయణన్ - సాహిత్యం, విద్య - కేరళ
5. వి.ఎస్. అచ్యుతానందన్ (మరణానంతరం) - పబ్లిక్ అఫైర్స్ - కేరళ

పద్మ భూషణ్

1. అల్కా యాగ్నిక్ - కళలు - మహారాష్ట్ర
2. భగత్ సింగ్ కోష్యారీ - పబ్లిక్ అఫైర్స్ - ఉత్తరాఖండ్
3. కల్లిపట్టి రామసామి పళనిస్వామి - వైద్యం - తమిళనాడు
4. మమ్ముట్టి - కళలు - కేరళ
5. నోరి దత్తాత్రేయుడు - వైద్యం - యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
6. పీయూష్ పాండే (మరణానంతరం) - కళలు - మహారాష్ట్ర
7. ఎస్.కె.ఎం. మేలానందన్ - సామాజిక సేవ - తమిళనాడు
8. శతావధాని ఆర్. గణేష్ - కళలు - కర్ణాటక
9. శిబు సోరెన్ (మరణానంతరం) - పబ్లిక్ అఫైర్స్ - ఝార్ఖండ్
10. ఉదయ్ కొటక్ - వాణిజ్యం, పరిశ్రమలు - మహారాష్ట్ర
11. వి.కె. మల్హోత్రా (మరణానంతరం) - పబ్లిక్ అఫైర్స్ - ఢిల్లీ
12. వెల్లపల్లి నటేశన్ - పబ్లిక్ అఫైర్స్ - కేరళ
13. విజయ్ అమృత్‌రాజ్ - క్రీడలు - యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా

# 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకోవాలి.

## -మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ.-తహసిల్దార్ శంకరరావు.

అక్షర విజేత , చింతపల్లి :
18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చింతపల్లి తహసిల్దార్ కే శంకర రావు అన్నారు. ఈ మేరకు 16 వ జాతీయ ఓటర్ల దినోత్సవం ను పురస్కరించుకొని మండల కేంద్రమైన చింతపల్లి లో ఆది వారం ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ కూడలి వరకు సాగింది. ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు కున్న ప్రాముఖ్యత పై అవగాహన కల్పిస్తూ, నినాదాలు చేశారు. అనంతరం పాత బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి ,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ తహసిల్దార్ శంకరరావు ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ జాతీయ ఓటర్ల



దినోత్సవం సందర్భంగా, ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది ప్రజా స్వామ్యంలో ఒక కీలకమైన అంశం అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవడం ద్వారా తమ భవిష్యత్తును నిర్ణయించు కోవచ్చన్నారు.ఓటు హక్కును వినియోగించు కోవడం ద్వారా సమాజంలో మార్పు తీసుకు రావచ్చన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న వారందరూ వారికున్న హక్కులను కాపాడుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ



తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కు ప్రాముఖ్యత పై అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర, రెవెన్యూ సిబ్బంది బాలరాజు దొర, మొట్టడం కృష్ణమూర్తి, పండయ్య, రెవెన్యూ , సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

# .నిర్భయంగా ఓట ఓటుహక్కు వినియోగించు కోవాలి.అరకులో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం.ఓటు హక్కుపై విద్యార్థుల భారీ ర్యాలీ.

అక్షర విజేత అరకులోయ..
నిర్భయంగా ఓట ఓటుహక్కు వినియోగించు కోవాలని ఆర్డిఓ పాడేరు,అరకు ఈఆర్ఓ ఎంవిఎస్ లోకేశ్వరరావు అన్నారు. భారత ఎన్నికల సంఘం పిలుపు మేరకు 28-అరకు నియోజకవర్గ కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెబుతూ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి, ఓటు హక్కును వినియోగించుకుంటామని, ప్రలోభాలకు లొంగకుండా నైతిక విలువలతో ఓటు వేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు విశిష్టతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతను ఈ సందర్భంగా అభినందించారు.ఎన్నో ఏళ్లుగా తమ ఓటు హక్కును వినియోగించు కుంటూ ప్రజాస్వామ్యానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న సీనియర్ సిటిజన్ ఓటర్లను ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత 100 శాతం ఓటింగ్ నమోదు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా అరకు ఈఆర్ ఓ మాట్లాడుతూ బలమైన ప్రజాస్వామ్య నిర్మాణంలో ప్రతి ఓటు ఒక శక్తివంతమైన ఆయుధం. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కును బాధ్యతగా భావించి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకు తహసీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఓ లోవరాజు,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఓటు హక్కు వజ్ర వజ్రాయుధం లాంటిది

## -తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు -సీనియర్ ఓటర్లకు సత్కారం

అక్షర విజేత బిదేవరపల్లి ;
ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని దేవరపల్లి మండల తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. దేవరపల్లి ఎంపీపీ మెయిన్



స్కూల్ నందు తాసిల్దార్ దేవరపల్లి వారి ఆధ్వర్యంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు సన్మానించి , కొత్త ఓటర్లు ను ఓటు విలువపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో ఓటు విలువను తెలుపుతూ ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎం. శ్రీనివాస్, ఆర్ ఐ షేక్ కమల్, వీఆర్వో పండు బాబు, బి ఎల్ ఓ లు వీఆర్ఏలు సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు.



# "వడ్డి"ని కలిసిన కార్యకర్తలు

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: మండలంలోని జగ్గన్నపేట, మోదుగుంట, ఉప్పరగూడెం గ్రామానికి చెందిన వైశ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి వడ్డీ ప్రోగ్రాం నాయుడిని శనివారం ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘురాం నాయుడు ఈ నెలలో నిర్వహించే నియోజకవర్గం సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎంపీపీ పోనుకుమాటి శేషులత పాల్గొన్నారు.

# సింహగిరి పై రథసప్తమి వేడుకలు





అక్షర విజేత సింహాచలం:: ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి వారు ఈ రోజు నుంచి తన దిశను ఉత్తర దిశకు మార్చుకుని ప్రయాణిస్తూ లోకానికి వెలుగు ప్రసాదిస్తాడు,కనుక ఈ సప్తమి రోజు న రథసప్తమి గా భావించి సూర్యదేవుని కి పూజలు చేస్తారు,ఈ రథసప్తమి ని పురస్కరించుకుని సింహాచలంలో అప్పన్న సన్నిధిలో గల రాతి రథం పై ఆలయ వైధికులు సూర్యనారాయణ స్వామి ని ఆసీనులు గావించి ప్రత్యేక పూజలు చేశారు,ఈ పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి సేవించి తరించారు,అలాగే సింహాచలం గోశాలలో ఉన్న సూర్యనారాయణ స్వామి వారికి ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం అధికారులు స్వామి దర్శనం కొరకు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు,అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# జహీరాబాద్ ప్రాంతానికి చెందిన వాసికి నంది అవార్డు

జహీరాబాద్)



జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్‌కు ప్రతిష్టాత్మక బంగారు నంది అవార్డు లభించడం విశేషం.రుద్ర బెస్ట్ హెల్పింగ్ ఫౌండేషన్ మరియు రుద్ర టీవీ ఆధ్వర్యంలో, సంస్థ అధినేత పి. రుద్ర శ్రీనివాస్ రావు వివిధ కళారంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులను గుర్తించి, వారి కళాసాధనకు ప్రోత్సాహంగా బంగారు నంది అవార్డులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ప్రాంతం, కోహిర్ మండలం, గురుజువాడ గ్రామానికి చెందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జి. చంద్రశేఖర్ సినిమాటోగ్రఫీ విభాగంలో ఉత్తమ సినిమాటోగ్రాఫర్ అవార్డును అందుకున్నారు. సినిమాటోగ్రఫీ రంగంలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభ, దృశ్యాల రూపకల్పనలో కనబరిచిన సృజనాత్మకతకు ఈ అవార్డు రూపంలో గుర్తింపు లభించింది.స్థానిక ప్రతిభావంతులను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు, కళాకారుల్లో దాగి ఉన్న కలలను గుర్తుచేస్తూ, వారు మరింత ఎదగడానికి ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ అవార్డు జహీరాబాద్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.

# ప్రథమ వర్ధంతి సభ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్ శెట్టి



నారాయణ ఖేడ్)

నారాయణఖేడ్ డివిజన్-నాగాల్ గిద్ద మండలం ఎస్గి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది కీర్తిశేషులు బాల్కీ కిషన్ రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్ శెట్టి పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు ఈ సందర్భంగా బాపు మల్ శెట్టి మాట్లాడుతూ కీర్తిశేషులు బాల్కీ కిషన్ రావు న్యాయవాదిగా రాజకీయంగా సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అవినీష్ రావ్. ప్రముఖ న్యాయవాది అనంతరావు కులకర్ణి. అంబేద్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు రహీం. రాష్ట్ర ఉపాధ్యక్షులు పండరి. హనుమంతరావు పాటిల్. రామ్ పాటిల్. తదితరులు పాల్గొన్నారు.



# చింతపల్లిలో ఘనంగా రథ సప్తమి వేడుకలు.

అక్షర విజేత,చింతపల్లి :

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న విజ్ఞాన భారతి పాఠశాల (బి.వి. కె)లో రథసప్తమి కార్యక్రమం నిర్వహించా రు. పాఠశాల ప్రధానాచార్యులు పి. వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘ శు ద్ధ సప్తమి రోజున సూర్యు ని రథం ఉత్తర దిశకుతిరుగుతుందని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ సప్తమి రోజున సామూ హిక రథసప్తమి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా సూర్య భగవంతునికి పూజలు నిర్వహించి, సూర్య నమ స్కారములు అందరితో చేయించ డం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో విజ్ఞాన భారతి పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కే రాజారావు , పాఠశాల కరస్పాండెంట్ జి. మోహన్ రావు ఖండాకార్యవర్గ కే శ్రీను , ఉపాధ్యా యులు సిబ్బంది విద్యార్థినీ విద్యార్థు లు తో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సోములు ప్రమాణ స్వీకారం

అక్షర విజేత గోపాలపట్నం::గత నాలుగు దశాబ్దాలు క్రితం తెదేపా కార్యకర్తగా ప్రయాణాన్ని ప్రారంభించి వార్డు అధ్యక్షులు గాను ఇంకా మరెన్నో పదవులను అలంకరించి ఆ పదవులకె వన్నె తెచ్చి నేడు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రోత్సాహం తొ తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతొ నేడు విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధిగా విశాఖ ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేసారు,ఈ సందర్భంగా విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వివిధ సంస్థల,సంఘాల ప్రతినిధులు మహిళా సంఘాల నాయకులు సోములును శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు,ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ పార్టీలో నాలుగు శతాబ్దాలుగా ఉన్నానని, స్వతహాగా నేను ఎన్టీఆర్ అభిమానినని పార్టీ ప్రారంభం నుండి పార్టీ లొ ఉన్నానని ఇప్పటికీ నేను ఎన్టీఆర్ కు వీరాభిమానినని అన్నారు,కార్యక్రమంలో సోములు అనుచరులు అభిమానులు పాల్గొన్నారు.

# అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

అక్షర విజేత గోపాలపట్నం::నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం, చేపలు, రొయ్యలు దుకాణాలు,జంతువధ శాలలు మొదలగునవి తెరవరాదని, ఇటువంటి దుకాణాలకు గణతంత్ర దినోత్సవం జాతీయ పండుగ సందర్భంగా సెలవు ప్రకటించడ మైనదని దీనిని అతిక్రమిస్తే కఠిన చర్యలు కు గురవుతారని జివిఎంసి ప్రధాన వైద్యాధికారి తెలియపరచి నట్లుగా పౌరసంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు

# ప్రమాదాల అంచున దర్శనాలా

విజేత,దేవీపట్నం :

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజవర్గం దేవీపట్నం మండలం గొందూరు మాత్రం శ్రీ గండి పోచమ్మ ఆలయం గత కొన్ని నెలల నుంచి వరద నీటిలో ఉన్నప్పటికీ భక్తులు





అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తున్నారు. అయినా అమ్మవారు గర్భగుడి దర్శనం జరిగినప్పటికీ పక్కన కొండపైన అమ్మవారి విగ్రహాన్ని పెట్టి సుమారు 90 అడుగుల ఎత్తున ప్రమాదకరంగా కర్రలు పాతి తాడు కట్టి ఆలయ అధికారులు వచ్చిన భక్తుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని పలువురు బహిరంగానే ఆరోపిస్తున్నారు. మరోవైపు గోదావరి నది ఒడ్డున భద్రత లేని స్నానాలు చేయడంతో అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా పొంచి ఉన్నాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి లక్ష్మీ కుమార్ అమ్మవారి టెంపుల్ దగ్గర లేకుండా ప్రతి ఆది మంగళవారాలు కనీసం కనిపించడం లేదని అంటున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుచున్నారు





# ఆదోని జిల్లా సాధన కై చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు విరామం ప్రకటించిన ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు

అక్షర విజేత:ఎమ్మిగనూరు

ఆదోని జిల్లాకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్లు ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు కమల గణేష్, శేఖర్ నాయుడు, ఉదయ్, రంగన్న,కాజా , ఆఫ్రిద్, రఘు, బతకన్న,సత్యనారాయణ రెడ్డి,పత్రికా విలేకరుల సమావేశం లో తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతాలలో విద్యా ,వైద్యం, త్రాగు, తాగునీరు ,పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమలు ,వలసల నివారణ, పశ్చిమ ప్రాంత అభివృద్ధి కొరకు ఆదోని జిల్లా కావాలని ,ఆదోని జిల్లా సాధనకై 48 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేసి ఆదోని జిల్లాగా ప్రకటించాలని 24 న బందు ప్రకటించడం జరిగిందని , ఈ బందుకు ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రజలు, వ్యాపార వర్గాలు, విద్యార్థి యువజన, ప్రజాసంఘాలు ,పోలీస్ వారు, ఉద్యోగులు స్వచ్ఛందంగా బందుకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, మరియు రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆదోని నీ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాలు ఆపే ప్రసక్తి లేదని ,త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బాలరాజు, నరసన్న, అమరేష్,ఎల్లప్ప, ప్రసాద్, నీలకంఠప్ప, తదితరులు పాల్గొన్నారు

# హలో నిరుద్యోగి చలో విజయవాడ

**ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 30న విజయవాడలో జరిగే నిరుద్యోగ రణభేరిని జయప్రదం చేయాలని- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు**



అక్షర విజేత:మంత్రాలయం

మంత్రాలయంలో నిరుద్యోగ రణభేరి వాల్ పోస్టర్లను జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బాబు షూరిటీ- జాబ్ గ్యారెంటీ ప్రచారం నిర్వహించి ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి 2 జనవరిలు పూర్తి అవుతున్న జాబ్ కేలండర్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తూ ప్రకటనలకే పరిమితం అవుతూ ఉన్నారు. తప్పా నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని నిరుద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మెడల్వంచి జాబ్ క్యాలెండర్ సాధించుకోవడం కాకుండా వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, నిరుద్యోగ భృతిని రాబట్టడం కోసం ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆధ్వర్యంలో జనవరి 31 న నిరుద్యోగ రణభేరి పేరుతో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో నిరుద్యోగులు యువతి ,యువకులు పాల్గొని నిరుద్యోగుల ఆక్రా శాన్ని కూటమి ప్రభుత్వానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కావున అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ పటేల్ ,మండల కార్యదర్శి ఎం రాజు, నాయకులు జెర్మియా, చిన్న రాజు,హుస్సేన్ భాష, చట్నీహల్లి గ్రామ నాయకులు నవీన్, కుమార్ ,దావీదు, ప్రవీణ్ లు పాల్గొన్నారు..

# మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

**-మంత్రాలయం వైయస్సార్సీపి మండల అధ్యక్షులు జి .భీమ రెడ్డి**

అక్షర విజేత మంత్రాలయం: మంత్రాలయం మండలం లోని రచ్చుమర్రి గ్రామంలో బోగా వీరేష్ మరణించడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్సీపీ మండలాధ్యక్షులు జి. భీమిరెడ్డి. అన్నారు. ఆదివారం రచ్చుమర్రి గ్రామానికి చేరుకుని బోగా వీరేష్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , రాంపురం రెడ్డి సోదరుల తరుపున తక్షణ సహాయం కింద రూ 10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకోబా, వైఎస్సార్సీపీ నాయకులు రోగప్ప, బొజ్జప్ప, నారయణ, తదితరులు ఉన్నారు





# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**-2వ వార్డు అభ్యర్థి కోసికే రాజశేఖర్**



అందోల్)
అందోల్ మున్సిపల్ 2వ వార్డు లో త్రాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం చూపిన 2వ వార్డు అభ్యర్థి కోసికే రాజశేఖర్ సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మతులు దృష్టిలో పెట్టుకొని భవిష్యతత్తు లో నీటి సమస్యలను ముందే గ్రహించి తన సొంత నిధులతో 3 బోర్లు వేయంచటం జరిగింది. 3 బోర్లు కూడా సక్సస్ కావడం తో అక్కడి ప్రజలు సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఇలాంటి నాయకుడు మాకు దొరకడం అదృష్టం గా భావించారు. ఆయనకు వారి తరుపున ధన్యవాదములు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అతడినే గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేసారు.

# కృష్ణభక్తితోనే ఇంద్రియ నిగ్రహం సాధ్యం

**-గోకులేష్ ప్రభుజీ**



( జహీరాబాద్, జనవరి 25:)
కృష్ణ భక్తి రసభావన యందు మనసు లగ్నం కానిదే ఇంద్రియ నిగ్రహం సాధ్యపడదని సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ బాధ్యులు గోకులేష్ ప్రభుజీ వ్యాఖ్యానించారు. జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు స్థానిక సాయిరాం కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణం లో జరిగిన సత్సంగ సభలో భక్తులనుద్దేశించి ఆయన అనుగ్రహభాషణం చేశారు. కృష్ణ పరమాత్మ యందు మనః పూర్వకంగా లగ్నం చేయనిదే విషయ కర్మలనుండి విముక్తి కాబోరని పేర్కొన్నారు. బ్రహర్షి విశ్వామిత్ర సైతం మేనక మువ్వల సవ్వడికే తన దీర్ఘ కాల తపస్సును భగ్నపరచుకోవడం గమనిస్తే ఇంద్రియ నిగ్రహం పాటించడం ఎంత కష్టతరమో తెలియజేస్తుందని వివరించారు. ఇంద్రియాలన్నీ దృఢత్వం కల్గియున్నవేనని,అయితే వాటిని విసర్జించడం ఒక్క కృష్ణ భక్తితోనే సాధ్యపడుతుందన్నారు. హరేకృష్ణ మహామంత్రం మనిషిని పరమాత్మ యందు నిలిపే సాధనంగా ఉపకరిస్తుందని సెలవిచ్చారు. విషయ భోగాలను త్యజిస్తూ దైవానికి దగ్గరవడమే ముక్తికి సోపాన మార్గమని హితవు పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసంగా ఒక మాల జపం చేయాలని సూచించారు. అంతకుముందు శ్రీ కృష్ణ కీర్తనలతో సాయిరాం కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. కీర్తనలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ భక్తులు పరవశించి పోయారు. స్థానిక వ్యాపారి చింతల్లగట్టు వీరేశం ప్రసాద వితరణ చేయగా, నరసింహ ఆరతితో 191 వ నగర సంకీర్తన వైభవంగా ముగిసింది.



# నూతన బోరలను ప్రారంభించిన ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్

ఝరాసంగం )
ఝరసంఘం మండల కేంద్రంలో బుడగ జంగం కాలనీ మరియు సంగప్ప వ్యవసాయ క్షేత్రం లో నూతనంగా వేసిన బోరులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్ రావు,డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ లు ఈ సందర్బంగా గ్రామ ప్రజలు పూలమాలతో ఘనస్వాగతం పలికారు.గత ఎన్నో ఏళ్లుగా గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉండడంతో బోరుకు మోటార్ బిగించి గ్రామానికి నీటి సరఫరా చేయడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం,గ్రామ సర్పంచ్ వినోద బాల్ రాజ్ , బొగ్గుల జగదీశ్వర్, ఉప సర్పంచ్ మమత అనిల్ పటేల్ నాయకులు,మాలి పటేల్ సంతోష్ కుమార్, నాగేశ్వర్ సజ్జన్,,ఎజాస్ బాబా,మాలి పటేల్ శ్రీనివాస్,రాయికోటి విలాస్,తమ్మలి విజయ్ ప్రకాష్ సింగ్ కుమార్, మహమ్మద్ అజరు, గోపాల్ కుమారి, లక్ష్మీకాంత్, ఉమేష్, ఠాగూర్ సంజు, గాజుల కృష్ణ, జావిద్ బూమ్ బూమ్, సద్దాం, సోషల్ మీడియా పింటు, దిగంబర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ లో చేరిన గంగాపూర్ సర్పంచ్ ఉప సర్పంచ్



ఝరాసంగం)
ఝరసంఘం మండలం గంగా పూర్ గ్రామ సర్పంచ్ షాహదా బీ,ఉప సర్పంచ్ సుజాత వార్డ్ మెంబర్ లు మొగలమ్మ,నాగలక్ష్మి , మలన్ బీ, గొల్ల యాదయ్య బాబు మియా సంజీవ్ కుమార్ ,పాషా,గోరేమియా షకీల్ ,బస్వరాజ్ ,కిష్టప్ప తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ లో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ సమక్షంలో చేరడం జరిగింది.వారికి గులాబీ కండువాలతో పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే, చైర్మన్ ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం , మాజి ఆలయ చైర్మన్ నీల వెంకటేశం, నరసింహ గౌడ్,తుమ్మన్పల్లి సర్పంచ్ సోహిల్ మాజి సర్పంచ్ లు బస్వరాజ్ పటేల్ ,ప్రభు పటేల్ ,నాయకులు సత్యం ముదిరాజ్, గ్రామ మాజి సర్పంచ్ శివరాజ్ పాటిల్,ఉమేష్ పాటిల్, నజీమ్ పటేల్,మస్తాన్,ధనరాజ్, సామెల్, బక్కప్ప , నర్సింలు,గొల్ల అంజయ్య ,బీరప్ప రమేశ్, మోసిన్,గోపాల్, సురప్ప, బాబు రావు,భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు..

# నూతన పంచాయతీ కార్యాలయానికి భూమి పూజ

న్యాల్కల్ మండల పరిధిలోని న్యామతబాద్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్,మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, మాజి మండల పార్టీ అధ్యక్షులు నరసింహ రెడ్డి,అధికారులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణంతో గ్రామ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి , ఉప సర్పంచ్ జైరాజ్, వార్డు సభ్యులు వీరన్న,విజయలక్ష్మీ,సుమలత,నాయకులు శ్రీనివాస్ రెడ్డి,ఉపేందర్, కిష్ట రెడ్డి, సంజీవ్ రెడ్డి గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# చకచకా సాగుతున్న అభివృద్ధి పనులు

**-నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్- నల్లాలు లేని ఇంటికి నల్లాలు బిగించారు**

. న్యాల్కల్)
న్యాల్ కల్ మండల పరిధిలోని అమీరాబాద్ గ్రామ సర్పంచ్ వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ పిజి.విజయ వైజనాథ్ కనిప్ ప్రతి ఇంటికి నల్లాలు బిగించారు. మంచినీటి గురించి ఇంటింట నల్లాలు లేని చోట నల్లాలు ఏర్పాటు చేయడం, లికేజీలు లేకుండ, ప్రతి ఇంటికి సమానంగ నీరు వచ్చే విధంగ పరిశీలించడమైనది అని గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ పిజి.విజయ వైజనాథ్ తెలిపారు.

# వి ఆర్ కె పురం సర్పంచ్ రమ్య ఆదేశాల మేరకు ప్రతి విద్యుత్ స్తంభానికి వీధి దీపాలు

వాజేడు)
ములుగు జిల్లా వెంకటాపురం మండలం వి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేవని గ్రామపంచాయతీ ప్రజలు సర్పంచ్ రమ్య గారి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన సర్పంచ్ గారు వి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలో ఏ ఒక్క విద్యుత్ స్తంభానికి కూడా విద్యుత్ దీపాలు లేకుండా ఉండకూడదు అనే ఉద్దేశంతో సంబంధిత పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర కి తెలియజేసి ప్రతి ఒక స్తంభానికి విద్యుత్ లైట్ వెలిగేటట్లు చూసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలోవి ఆర్ కె పురం సర్పంచ్ రమ్య,వార్డు మెంబర్ గార మంగవేణి, పంచాయతీ సిబ్బంది బ్రహ్మం, వెంకటేష్, సతీష్,తదితరులు పాల్గొన్నారు.



# చుంచనకోటలో పలు అంశాలపై అవగాహన ర్యాలీ




చేర్యాల,జనవరి26(
సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట గ్రామం లో ఆదివారం పరిసరాల పరిశుభ్రత,ప్లాస్టిక్ నిషేధం,గంజాయి డ్రగ్స్,మత్తు పదార్థాలు,గుట్కా నిర్మూలనపై అవగాహన ర్యాలీనీ గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఇంటి ఇల్లాలు బాధ్యత అని,తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరు చేసి బహిరంగ ప్రదేశాలలో కాకుండా చెత్త బండి లోనే చెత్తను వేసి ఊరిని శుభ్రంగా ఉంచాలని,అలాగేయువత గంజాయికి, మత్తుకు దూరంగా ఉండి తమ జీవితానికి దగ్గరగా ఉండి జీవితాలను కాపాడుకోవాలని యువతకు తెలిపాడు.సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలను కోరాడు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్యా,వార్డు సభ్యులు వెంకటేశం,గ్రామస్థాయి ఉద్యోగులు,గ్రామ పంచాయతీ కార్యదర్శి,సిబ్బంది,మహిళలు,గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు డి.కిష్టయ్య,సభ్యులు,యువకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్ ప్రతాప్ ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్)
నారాయణ ఖేడ్ మండలంలోని జగనాథ్పూర్ గ్రామానికి చెందిన ప్రతాప్ రిపోర్టర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకొని వారి ఆదివారంనాడు ఇంటికి వెళ్లి పరామర్శించిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు భూపాల్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతాప్ తర్వాత కోలుకోవాలని బయటకు రావాలని ప్రజలు ప్రతిరోజు వార్తలు రాస్తూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని దృష్టి తీసుకోవాలని కోరుతున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, ప్రకాష్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సి ఎస్టీ నూతన సర్పంచ్ లకు సన్మానం చేసిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

ఝరాసంగం)
ఝరాసంగం మండల కేంద్రం లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సి ఎస్టీ నూతన సర్పంచ్ లకు ఆదివారం అంబేద్కర్ భవన్ లో శాలువ పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల అబివృద్ధికి తోడ్పడాలని తెలిపారు సన్మానం పొందిన.సర్పంచ్ లు వినోద బల్ రాజ్, చింతల్ గట్టు శివరాజ్,అమృత్ రాజు, సుభాష్, నవీన్ పటేల్ ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎస్ నర్సింలు మాజీ సర్పంచ్, పెంటయ్య,శంకర్, రాయి కోటి నర్సిములు సంగన్న కృష్ణ, అనిల్ మల్లేశం నర్సిములు శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

